
## నవ్య వీక్లి - పసుపులేటి లక్ష్మీనారాయణ స్మృతిసాహితి కథల పోటీలో

# రూ. 2,000 ప్రోత్సాహక బహుమతి పొందిన కథ

ఉదయం ఎనిమిదిన్నర గంటలు. స్వరాజ్ మాజ్దా క్యాబ్ ఎలెక్ట్రానిక్ సిటీలో ఉన్న క్లియో సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ బెంగుళూరు హెడ్‌క్వార్టర్స్ వైపు పరుగులు తీస్తోంది. సిటీ స్టాపులన్నిట్లో ఒకరిద్దర్ని ఎక్కించుకున్న బస్ నిండిపోయింది. నగరం హద్దులు దాటిన తర్వాత ఇంక బస్సెక్కడా నిలవదు. అందులో ప్రయాణిస్తున్న వారంతా ఇరవయి ఐదు నుంచీ ముప్పయి వరకూ వయసున్న యువతీయువకులే! కొందరు వాళ్ళ ఆలోచనలు, ఒత్తిడులలో వాళ్ళుంటే, మిగతా వాళ్ళు పక్కన, ఎదురుగా ఉన్న వాళ్ళతో కబుర్లు చెప్పుకుంటున్నారు. వెయ్యిమంది పైనే పనిచేసే ఆ కంపెనీలో ఎన్నో ప్రాజెక్టులు. వాటివే వేరే మైల్‌స్టోన్లు, డెడ్‌లైన్లు. అందుకని ఎప్పుడూ కొందరు ప్రాజెక్టు టెన్షన్లలో ఉంటారు. కానీ చాలామటుకు యువతీ యువకులు కాబట్టి లోపలెంత కష్టం ఉన్నా, పైకి మజా చేస్తున్నట్లే ఉంటారు. సాధారణంగా క్యాబ్‌లో వాళ్ళ మేనేజర్లు ప్రయాణించరు. అందుకని జాలీగా వాళ్ళమీద ఫిర్యాదులు, జోకులు, తిట్లు బస్సులో ఆ చివరినుంచీ ఈ చివరి వరకూ సంచరిస్తున్నాయి.

# బ్రతుకు దారిలో

### వింధ్యవాసిని



రెండో వరుస కిటికీ సీట్లో కూర్చుని ఉన్న దుర్గ మౌనంగా తన ఆలోచనల్లో మునిగి ఉంది. తన భర్త రాజేష్ గురించే ఆమె ఆలోచనలు. ఎకనామిక్స్ మరియు మ్యాథ్స్‌లో డబుల్ మాస్టర్స్ పదవులున్న రాజేష్ ఇంకొక సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఫైనాన్స్ ఎక్జిక్యూటివ్‌గా ఉన్నాడు. అతడూ మునుపు క్లియోలోనే పని చేసేవాడు. అప్పుడే వీళ్ళిద్దరి పరిచయమయింది.

మొదటిసారి లిఫ్ట్‌లో కనిపించాడు రాజేష్ దుర్గకు. తల ఒంచుకుని ఏదీ పట్టించుకోకుండా వెళ్ళే రాజేష్‌ను కొత్తగా చేరిన ఉద్యోగి దుర్గ కళ్ళలోని వెలుగు, పెదవుల మీద చెరగని చిరునవ్వు, ఎప్పుడూ పక్కనున్న సహోద్యోగులతో గలగల మని ఏదో మాట్లాడే తీరు చాలా ఆకర్షించాయి. తర్వాత ధైర్యం చేసి కొన్నిరోజులు ఆమె వెళ్ళే క్యాబ్‌లో సాయంత్రాలు తనూ ఎక్కి దుర్గ పక్కనో, దగ్గర్లోనో సీటు సంపాదించేవాడు. ఆ పరిచయమే ప్రేమగా మారడానికి ఎక్కువరోజులు పట్ట లేదు. తరువాత ప్రతీ రోజూ సాయంత్రం ఇద్దరి పనులయ్యాక కలిసి, ఆఫీసు పక్కనే ఉన్న చిన్నపూవుల తోటలో దట్టంగా పెంచిన లాన్స్‌లో పచార్లు చేస్తూనో, అక్కడే ఉన్న ఒక సిమెంటు బెంచీ మీద కూర్చునో కబుర్లు చెప్తూ కాస్సేపయినా గడిపేవారు. తరువాత ఇద్దరూ ఎనిమిది గంటలకు బయలుదేరే రెండో క్యాబ్‌లో వెళ్ళేవాళ్ళు. ఏదయినా ఒక రోజు రాజేష్ తన బైక్ తీసుకొస్తే, ఇద్దరూ త్వరగా సిటీలోకి వెళ్ళి ఏ 'కాఫీ డే' లోనో 'బరిస్టా' లోనో కూచుని గడిపేవారు.

కానీ దుర్గ మాత్రం ఒక సంవత్సరమయినా ఉద్యోగానుభవం అయ్యేదాకా రాజేష్ విషయం ఇంట్లో దాచింది. ఇద్దరూ తల్లిదండ్రులకు ఒకే సంతానం కావడం వల్ల వాళ్ళే దగ్గరుండి పెళ్ళి జరిపించారు. బెంగుళూర్లో మునుపే తమకు స్వంతంగా ఉన్న అపార్ట్‌మెంటులోనే రాజేష్ అప్పటికే ఉంటున్నాడు. అందుకని పెళ్ళయ్యాక ఇంకొక ఇల్లు చూడవలసిన అవసరం రాలేదు.

ఆరు నెలల క్రితం రాజేష్‌ను రెన్‌బా నెట్ వర్క్స్ కంపెనీ వాళ్ళు పిలిచి అవకాశమిచ్చారు. నిరాకరించడానికి కారణం కనిపించలేదు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఇది మామూలు. హెడ్ హంటర్స్ ఒక కంపెనీలో పని చేస్తున్న సమర్థులయిన ఉద్యోగులను ఇంకొక కంపెనీకి రప్పించి కమీషన్లు కొట్టుకుంటుంటారు.

నెలరోజుల క్రితం వరకూ అంతా సవ్యంగానే ఉంది. రాజేష్ టీం లీడ్ మేనేజర్ కొత్త కంపెనీ అక్వైర్ చేసుకునే విషయంలో టూర్‌లో ఉన్నాడు. అందుకని కొత్తగా సుబ్రమణి అనే అతన్ని లీడ్‌గా వేశారు. ఇతడు


కంపెనీ వైస్ - ప్రెసిడెంట్‌కు దగ్గరి బంధువు. ఆ పొగరు తెచ్చిపెట్టిన ధైర్యం వల్ల, కష్టపడి పని చేస్తాడని, చాలా తెలివయిన వాడనీ పేరున్న రాజేష్ అంటే అతనికి సహజంగా పడదు. వీలయినంత ఎక్కువగా పనీ, అనవసరమయిన ఒత్తిడీ పెట్టి సతాయిస్తుంటాడు. ఇటీవల రాజేష్‌ను పని కూడా చేయనివ్వకుండా ప్రతీ అర గంటకూ స్థితిగతులు అడుగు తున్నాడు.

రాజేష్ రోజంతా ఆఫీసులో ఎదుర్కొంటున్న పరిస్థితులు, అతని మనస్థితి మీద చూపిస్తున్న ప్రభావం ఇంట్లో దుర్గ ముందు బయటికి రాక తప్పటం లేదు. అతనికి ప్రతి రోజూ తనకిచ్చే అసాధారణమైన టార్గెట్లను అందుకోవడానికి పది పని గంటలు చాలటం లేదు. అందుకని ఏడు గంటలకే ఇల్లు వదుల్తాడు. రాత్రి ఏ పది గంటలకో తిరిగొస్తాడు. ఈ కంపెనీల్లో ఇలా పనిచేయటం వీళ్ళకేం కొత్తకాదు. దుర్గ కూడా అప్పుడప్పుడూ ఇలా, ఇంకా రాత్రుళ్ళు ఇంటికి రాకుండా కూడా పని చేయాల్సి వస్తుంది. కానీ ఆమెను వేధిస్తున్న కారణం రాజేష్ ఇంట్లో కూడా విశ్రాంతిగా, ప్రశాంతంగా ఉండలేక పోవటం. పోనీ ఉద్యోగం మార్చెయ్యమని చెప్దామా అంటే, ఇప్పుడున్న ఆర్థిక మాంద్యంలో కొత్తగా ఉద్యోగాలు దొరకటం కాదు కదా ఉన్నవి ఊడుతున్నాయి. దుర్గ ఆలోచనల్లో కొట్టుకుంటూ ఉండగానే బస్సు క్యాంపస్ చేరింది.

సెక్యూరిటీ ఏరియా దాటి అందరూ తమతమ ఆక్సెస్ కార్డులను స్వైప్ చేసి లోపలికెళ్ళారు. కొందరు అక్కడే ఒక బోర్డు మీద పిన్ చేసి ఉన్న ఆవేళ పుట్టిన రోజులు జరుపుకుంటున్న ఉద్యోగుల పేర్ల లిస్ట్‌లో ఎవరయినా తెలిసిన వాళ్ళున్నారా అని చూస్తున్నారు. దుర్గ మాత్రం పరధ్యానంగా 'ఇన్ఫోడెవ్' సెక్షన్ వైపు నడిచింది. ఆమె ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ చదువుతున్నప్పుడు, 'తాంత్రిక రచన' (టెక్నికల్ రైటింగ్) అన్న రంగం ఒకటుందనీ అందులో కూడా పెరుగుతున్న ఉద్యోగశ్రేణి, అవకాశాలు ఉన్నాయని ఆమెకు తెలీదు. తను ఆఖరు సంవత్సరంలో ఉండగా, క్లియో కంపెనీ హెచ్ ఆర్ వాళ్లు వచ్చినప్పుడు ఈ అవకాశాల గురించి చెప్పారు. దుర్గకు ఇంగ్లీషులో అప్పుడప్పుడు ఏదయినా రాసుకోవడం, మంచి పుస్తకాలు చదవటం అలవాటు. అదీ ఒక వృత్తివిద్య అని తెలిసి ఆకర్షించబడింది. క్లియో కంపెనీ వాళ్ళు దుర్గకు, ఇంకా పది మంది ఈమెలాంటి అనుభవం లేని వాళ్ళకూ కలిపి మూడు నెలలు శిక్షణ ఇచ్చారు. దాని తర్వాత నుంచీ దుర్గ రెండేళ్ళుగా అక్కడే తాంత్రిక రచయితగా పనిచేస్తోంది.

తన క్యూబికల్లో కూర్చుని కంప్యూటర్ ఆన్ చేసి లాగిన్ చేసి వెంటనే మెయిల్‌బాక్స్ తెరిచి ఆ రోజు కొత్తగా వచ్చిన మెయిల్స్ చెక్ చేసుకుని ముఖ్యమయిన వాటిని తెరిచి చదువుకుంది. కేలెండర్లో మధ్యాహ్నం ఒక ఇన్‌స్పెక్షన్ మీటింగ్ షెడ్యూల్ అయినట్లు గమనించింది. అందులో పాల్గొనటానికి తను తయారుచేసుకున్న 'ఇన్‌పుట్స్' సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకోవాలని డైరీలో నోట్ చేసుకుంది.

సహోద్యోగి కవిత దగ్గరికొచ్చి, "నిన్న ఇచ్చిన



నా డాక్యుమెంట్ పీర్ -రివ్యూ అయిందా? బైదవే, ఎందుకంత దిగులుగా ఉన్నావు? ఏమయింది? ఒంట్లో బాగులేదా?'' ఇద్దరూ అంత దగ్గర స్నేహితులేం కాదు. అయినా మనసులో బాధ చెప్పుకుంటే తనకే తేలికగా ఉంటుంది. అందుకని, ''కాఫీ బ్రేక్‌లో చెప్తాన్లే. అయాం వర్రీడ్ అబౌట్ రాజేష్ కవితా! ఆ! ఇప్పుడు నీ డాక్యుమెంటే చూస్తున్నాను. నిన్న టైమ్ దొరకలేదు. మధ్యాహ్నం ఇస్తాను సరేనా?'' అని యాంత్రికంగా ఎం.ఎస్ వరల్డ్‌లో 'ట్రాక్ చేంజెస్' ఆప్షన్ సెట్‌చేసి, ఒక్కొక్క తప్పే సరిదిద్దుతూ పోయింది. రచయితల్లో ఎవరు ఏ సహాయ గ్రంథాన్ని వ్రాసినా మరొకరు 'పీర్ రివ్యూ' చేయడం ఒక పద్ధతి. తరువాత ఆ డాక్యుమెంట్‌ను వాళ్ళు ముప్పయి మంది రచయితలకు కలిపి ఉన్న ఒక భాషా నిపుణుడు 'ఎడిట్' చేసిన తర్వాత 'ఇ-ఇన్‌స్పెక్షన్' చేయటానికి కొందరు తాంత్రిక విజ్ఞానులకు పంపుతారు. ఇన్ని చుట్లు తిరిగిన తర్వాతే ఆ గ్రంథం ప్రచురణకు తయారు అవుతుంది. మనసు రాజేష్ మీదికే పదేపదే వెళ్తోంటే దాన్ని ఆపి చేస్తున్న పనిమీద కేంద్రీకరించడానికి విఫల ప్రయత్నం చేస్తూ లంచ్ బ్రేక్ వరకూ గడిపింది దుర్గ.

మధ్యాహ్నం పనిలో పడి మరిచిపోయి సాయంత్రం మామూలుగా క్యాబ్ ఎక్కి బిటిఎం లేఔట్‌లో ఉన్న తమ అపార్టుమెంటు చేరుకుంది. 'ఈ రోజెన్ని గంటలకు ఇల్లు చేరగలుగుతాడో?' అని రాజేష్ గురించి అనుకుంటూ తలుపు తాళం తీసింది. ఫ్రెషప్ అయి కాఫీ చేసుకుందామని వంట గదిలోకి వెళ్ళబోతూ, పడక గదిలో ఏదో శబ్దం అవుతే అటు వెళ్ళింది. లోపల మంచం మీద రాజేష్ దుప్పటి కప్పుకుని పడుకుని ఉన్నాడు. ''ఏమయింది రాజూ?'' అని ఆదుర్దాగా అడుగుతూ దగ్గరికెళ్ళింది. అతడు కళ్ళ మీద ఉంచుకున్న మోచేతిని తొలగించకుండానే, ''అంతా అయిపోయిందిరా!'' అన్నాడు నిస్పృహగా. దుర్గకేమీ అర్థం కాలేదు. వెళ్ళి ఇద్దరికీ కాఫీ చేసుకుని వచ్చి అతన్ని బలవంతంగా లేపి కాఫీ తాగించింది. తరువాత మెల్లగా అసలు విషయం అతని నోట బయటికొచ్చింది.

***

రెండు వారాలుగా రాజేష్ తయారుచేస్తున్న ఒక కొత్త ప్రొడక్టుకు సంబంధించిన మార్కెట్ పరిశీలనా విశ్లేషణను ఆ రోజు సీనియర్ మేనేజ్‌మెంటు ముందు చర్చకు పెట్టాడు రాజేష్ ప్రాజెక్ట్ మేనేజర్. అందులో మొత్తం ఉన్నదంతా రాజేష్ కృషే అయినా అతని పేరును కూడా ఎక్కడా ఎత్తకుండా అంతా తనేచేసిన అర్థం వచ్చేలా మాట్లాడాడు మీటింగులో సుబ్రమణి. అంతకుముందు రోజు మామూలుగా 'ప్రెజంటేషన్'కు కావలసిన పవర్ – పాయింట్ స్లైడ్స్ చెయ్యమని రాజేష్‌ను సుబ్రమణి అడగలేదు. అప్పుడే అనుమానం వచ్చింది రాజేష్‌కు. ప్రెజంటేషన్ బాగా జరిగింది. ముఖ్యంగా ఎమ్‌డికీ నచ్చడం, ఆయన మెచ్చుకోలు రాజేష్‌కు సంతోషం కలిగించింది. గర్వంగా అనిపించింది. తన బాస్‌మీద కోపం ఎక్కువయింది. మీటింగ్ అయ్యాక ఏమయితే అయిందని నేరుగా వెళ్ళి తలపడి అడుగుదామని అనుకున్నాడు. అందువల్ల తనకు సంతృప్తికరమయిన ఫలితం లేకపోతే, నేరుగా హెచ్ ఆర్ వాళ్ళను కలిసి, తనను ఇంకొక ప్రాజెక్టులోకి బదిలీ చెయ్యమని కోరాలని కూడా అనుకున్నాడు.

## నా ఊహ నిజానికి దగ్గరే!



అనంతపురం హైస్కూల్లో విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు కథలు రాయడం మొదలు పెట్టాను. వందపైన కథలు రాశాను. ప్రస్తుతం బెంగుళూరు లోని ఓ కంపెనీలో నలభయి మంది తాంత్రిక రచయితలను మేనేజ్ చేస్తున్నాను. అందుకే ఆ రంగం గురించి కథలో వివరించాను.

'బ్రతుకు దారిలో..' ఒక ద్వారం మూసుకుంటే, మరొక తలుపు తెరుచుకుంటుంది. దాన్ని మనం కళ్లు తెరిచి చూసుకోవాలి! 'రిసెషన్' సమయంలో కంప్యూటర్ పరిశ్రమలో సాంప్రదాయికమయిన ఉద్యోగాలు తగ్గిపోతున్నప్పుడు, ఈ పరిశ్రమ ఉద్యోగులు తమ విద్యార్హతలు, అనుభవంతో వేరే ఉద్యోగాలు ఏవి చెయ్యొచ్చని ఆలోచించగలగాలి. ఈ కథ ద్వారా నేను చెప్పదలచుకున్నది ఇదే! నేనీ కథ రాసిన కొద్దిరోజుల్లోపలే తెలిసింది నా ఊహ నిజానికి దగ్గరే అని. కంప్యూటర్ పరిశ్రమలో ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ డిజైన్ చేసి, ప్రోగ్రాములు వ్రాసి సాఫ్ట్‌వేర్ తయారు చేస్తారు. ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించే వ్యక్తికి కావలసిన సహాయాన్ని అందించేవే 'యూజర్ మాన్యువల్స్'(సహాయ గ్రంథాలు). వీటిని తయారు చేసే వృత్తినే టెక్నికల్ రైటింగ్ (తాంత్రిక రచన) అంటారు. ఈ రంగాన్ని పాఠకులకు పరిచయం చేయడం కూడా నా ఉద్దేశ్యం. అందుకే ఈ కథలో ముఖ్యపాత్ర దుర్గ తాంత్రిక రచయిత.

**–వింధ్యవాసిని**

**జి-202, మంత్రి టెర్రస్,**
**1303, బిలేకహళ్ళి, బన్నేర్‌ఘట్ట రోడ్,**
**బెంగుళూరు – 560 076**
**సెల్: 09845177368**

రాజేష్ తన క్యూబికల్ లోకి వెళ్ళి, సుబ్రమణి క్యాబిన్‌లోకి రావడానికి కాచుకుని ఉన్నాడు. అతని టేబుల్‌మీదున్న ఫోన్ మోగింది. రిసీవర్ చేతికి తీసుకున్నాడు. రామలింగం అనే ఆయనది ఫోన్. ఇతడు ఒక కంపెనీ డైరెక్టరు, సుబ్రమణి బాస్. అతడు తన క్యాబిన్‌కు రమ్మని పిలిచాడు. రాజేష్ ఈయన్ను కలిసేది అపురూపం. సంవత్సరంలో ఏ రెండు మూడు సార్లో. కానీ సుబ్రమణి ఇక్కడ చేరకముందు నుంచే రామలింగంకు రాజేష్ తెలుసు. అందుకని మీటింగులో సుబ్రమణి తన పేరు వదిలేసినా ఈయన అసలు సంగతి పసికట్టాడేమోనని ఆశ పడ్డాడు రాజేష్. అవకాశం దొరికితే అసలు విషయం ఆయనకు చెప్పాలని కూడా అనిపించింది. ఉత్సాహంగా రామలింగం దగ్గరికెళ్ళాడు.

"హై! హౌ ఆర్ యు డూయింగ్ రాజేష్?'' అని మామూలుగా చిరునవ్వుతో పలుకరించాడు రామలింగం. రాజేష్ కూడా పెదవుల మీద చిరునవ్వు తెచ్చుకుని, ''ఫైన్ రాం! ఆమ్ డూయింగ్ వెల్!'' అని ఆయన ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో మంచో చెడో ఇదొక అమెరికా నుంచీ అరువు తెచ్చుకున్న అలవాటు. కంపెనీలో ఎంత పెద్దవాళ్ళనయినా పేర్లు, పొట్టి పేర్లతో పిలుచుకోవటం, ఎంత క్లిష్ట పరిస్థితినీ, చెడు వార్తనూ చర్చించాల్సి ఉన్నా, ముందు ఉభయ కుశలోపరి అడగటం. రాజేష్ కూర్చోగానే ''హౌ ఆర్ థింగ్స్ ఎట్ హోమ్? అమ్మా నాన్నా బాగున్నారా?'' అని అడిగాడు రామలింగం. పైవాళ్ళు కింది వాళ్ళను కలిసినప్పుడు ఇలా కుటుంబాలను గురించి అడగటం కూడా మామూలుగా జరుగుతుంది. ఇది అరువు తెచ్చుకున్న అలవాటు కాకున్నా, చిన్న ఉద్యోగులను సంతోష పరచడానికి పెద్ద ఉద్యోగులు ఇలా మాట్లాడటం మనం తయారు చేసుకున్న అలవాటు.

అసలు విషయానికొచ్చాడు రామలింగం. ''నువ్విలా చేశావంటే నమ్మలేక పోయాను. రాజేష్'' అన్నాడు ఉపోద్ఘాతంగా. ''ఏమయింది రామ్!'' అని అడిగాడు రాజేష్ ఆదుర్దాగా. ''సుబ్రమణి చేసి పెట్టిన పరిశోధనలో సంఖ్యలు అన్నీ మార్చేసి చాలా ఇబ్బంది పెట్టావట. ఏమయింది నీకు? దిసీస్ వెరీ అనెథికల్ యు నో? అసలు పరిశోధన అంతా చెయ్యాల్సింది నువ్వు. పాపం అతను చేసింది కూడా పాడు చేసే హక్కు నీకేముంది? అసలు ఈ చెడ్డ బుద్ధి నీకెందుకు వచ్చింది? అతను తప్పులు దిద్దుకోవడానికి రాత్రంతా పని చెయ్యవలసి వచ్చింది తెలుసా?'' ఆయన ఎంత కోపంగా ఉన్నాడంటే రాజేష్ ఇప్పుడేం చెప్పినా ప్రయోజనం లేదు. ఆయన వినడు.

''గో ఎండ్ ఎపాలజైజ్ టు సుబ్రమణి!'' అని తరిమేశాడు. ''ఎపాలజైజ్ మై ఫుట్! డామ్ హిమ్!'' అని లోలోపలే గొణుక్కుంటూ, పళ్ళు నూరుకుంటూ సుబ్రమణి క్యాబిన్ వైపు నడిచాడు రాజేష్. ''ఈ రోజు వీడి పనయిపోయింది!'' అనుకున్నాడు. అతని నీచత్వానికి కాండ్రించి ఉమ్మేంత అసహ్యమేసింది. కింద కార్పెట్ మీద బాగుండదని నియంత్రించుకున్నాడు. ''అయాం వాకింగ్ అవుటాఫ్ దిస్ కంపెనీ!'' అని అతనికి చెప్పెయ్యాలనుకుని, మెడలో వేలాడుతున్న కంపెనీ బ్యాడ్జ్‌ను తీసి చేతిలో పట్టుకున్నాడు అతని మీద విసిరేద్దామని.

ఆ అవసరం రాలేదు. సుబ్రమణి నిశ్శబ్దంగా, పెదవుల మీదికొక వెకిలి నవ్వు తెచ్చుకుని, ఒక కాయితాన్ని అందించాడు రాజేష్‌కు. పూర్తిగా అందులో ఏమున్నది చదవక ముందే, ఏదో విజయం సాధించిన వాడు ఆగలేనట్లు, ''యు ఆర్ ఫైర్డ్!'' అన్నాడు సుబ్రమణి. రాజేష్ ఇంకా ఏ రకంగా స్పందించకముందే, ''అఫ్ కోర్స్! యు హావ్ ది ఆప్షన్ టు రిసైన్!'' అన్నాడు ఏదో సహాయం చేసి పెడుతున్నవాడిలా.

***

రాజేష్ ఉద్యోగం లేకుండా ఇంట్లో కూర్చోవడం నెల రోజులు దాటింది. ఈ పరిస్థితుల్లో కష్టమే అయినా ఏదో ఒక అవకాశం ఇన్నిరోజులు రాదని ఇద్దరూ అనుకోలేదు. ఇంత వరకూ ఇద్దరివీ మంచి జీతాలు కాబట్టి, ఇద్దరిదగ్గరా దాచి ఉంచుకున్న డబ్బు చాలనే ఉంది. అందువల్ల ఇంకా ఆర్థికంగా అంత కష్టంగా లేకపోయినా ముఖ్యమయిన సమస్య రాజేష్ సోమరిగా ఇంట్లో ఉండవలసి రావటం. జీవితం అతని మీదికి బలవంతంగా తోసిన ఈ సెలవులను

అతడు భరించలేకుండా ఉన్నాడు. అవకాశాలు అసలు రాలేదని కాదు కానీ, అతడు ఇంతవరకూ చేసినంతకన్నా చిన్న ఉద్యోగావకాశాలు అంగీకరిద్దామంటే అప్పటికి సగం జీతం ఇస్తామంటున్నారు. రాజేష్ సామర్థ్యం విలువ అంతకన్నా ఎక్కువ అనిపించి దుర్గే వద్దని చెప్పింది. మళ్ళీ సమయానికి సరిగ్గా భోజనం కూడా చెయ్యకుండా పడుకుని ఎప్పుడూ ఆలోచిస్తూ ఉండే రాజేష్‌ను చూస్తే తను తప్పు చేస్తున్నానా అనిపిస్తుంది.

చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలించనప్పుడు, కొత్త అవకాశాలు రానప్పుడు సహజంగా రాజేష్‌కు తను తప్పుచేశానా అన్న ఆలోచనలు. సాయంత్రం దుర్గ వచ్చాక తన మనసును పీడిస్తున్న చింతలన్నీ బయటికి తీస్తాడు.

"నేను తొందరపడి రాజీనామా ఇవాల్సింది కాదేమో అనిపిస్తుందిరా. రామలింగం దగ్గరికో, హెచ్ ఆర్ మేనేజర్ దగ్గరికో వెళ్ళి మాట్లాడాల్సింది. ఆ కంపెనీలో నాకున్న హక్కును నేను సులభంగా వదిలేసానంటావా?"

"లేదులే రాజూ! ఆ సుబ్రమణిగాడు అంత త్వరగా నీ పేరున 'టర్మినేషన్' ఆర్డర్ పుట్టించాడంటే, అక్కడింకా ఎవరయినా నీ మాటలు నమ్ముతారని నాకనిపించదు".

"నాకు ప్రయోజనం లేకపోయినా ఆ సుబ్రమణి బండారం బయలు చేయాల్సిందేమో కదా? వాడింకా ఎంతమంది 'కెరీర్స్' ఇలా పాడు చేస్తాడో! వెధవ!"

"అవన్నీ మనకెందుకు. అలాంటి వాళ్ళకు పరిశ్రమలో తెలిసిన వాళ్ళు చాలామంది ఉంటారు. వాడికి నీ మీద కోపం ఎక్కువ చేయటం నీకే మంచిది కాదులే!" అని దుర్గ అతన్ని అతడు తప్పేం చెయ్యలేదని సమాధాన పరిచింది.

ఆఫీసులో దుర్గ సహోద్యోగులందరికీ తెలుసు వీళ్ళిద్దరూ ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులు. దుర్గ మేనేజరు హేమంత్ కూడా దుర్గ మీద సానుభూతి ఉంది. అప్పుడప్పుడూ దగ్గర కూర్చోబెట్టుకుని యోగక్షేమాలు కనుక్కుని మాట్లాడిస్తూ ఉంటాడు. దుర్గకు పరిస్థితులు ఎలా ఉన్నా పనిలో రాజీ పడే అలవాటు లేదు. పనిలోనే తన కష్టాన్ని మర్చిపోవడానికి ప్రయత్నిస్తుంటుంది.

దుర్గ మనసెంత రాయి చేసుకోవాలని ప్రయత్నించినా, ఒకొక్కసారి ప్రశాంతంగా పని చెయ్యటం చాలా కష్టమవుతుంది. రోజులో కనీసం మూడుసార్లయినా రాజేష్‌కు ఫోన్‌చేసి అతనెలా ఉన్నాడో కనుక్కుంటుంది. అయినా ఒకో రోజు సమయానికి భోం చెయ్యకుండా, గడ్డం గీసుకోకుండా జబ్బు చేసిన వాడిలా ఉండిపోయే రాజేష్‌ను చూస్తే ఆమెకు భయమేస్తుంది. అతను 'మూడ్ స్వింగ్స్'కు లోనయి మానసిక సమతులనం కోల్పోతున్నాడా అనిపిస్తుంది. అలాంటి రోజుల్లో తను ఫోన్ చేసినా అతను తీసుకోడు. తీసినా ఏం మాట్లాడడు. అలాంటిదే ఒక రోజు, ఇంటికి వెళ్ళిన తర్వాత రాజేష్ని బెదిరించింది. "నువ్విలా నీ ఆరోగ్యం పాడుచేసుకుంటే నేను చూడలేను. నేనూ ఉద్యోగం మానేసి ఇంట్లో నిన్ను చూసుకుంటు ఉంటాను. సరేనా? ఇది తాత్కాలిక పరిస్థితి. త్వరలో అంతా మారిపోతుంది. మనం కాస్త ఓపిక పట్టాలి" అని.

పోనీ తనూ కొన్ని రోజులు బ్రేక్ తీసుకుని ఇంట్లో ఉండి పోదామా అనిపించింది దుర్గకు. కనీసం రాజేష్‌ను చూసుకుంటూ అయినా ఉండొచ్చు అనిపించేది. ఒకసారి హేమంత్‌తో ఈ విషయం చర్చించింది కూడా.

హేమంత్ "బాగా ఆలోచించుకుని చెప్పు దుర్గా! నన్నడిగితే ఇదేమంత మంచి ఐడియా కాదు. ఇరవయి నాలుగంటూ నువ్వూ ఎదురుగా ఉండి రాజేష్‌కు తన నిరుద్యోగాన్ని నిముషం నిముషం గుర్తు చేసినట్లవుతుందేమో!" అన్నాడు. అదీ నిజమే కదా అనిపించింది దుర్గకు. రాజేష్ తనకు భర్తగా తెలుసు. కానీ మగవారి మనసేమిటో హేమంత్‌కు స్పష్టంగా తెలుస్తుందేమో!

రోజులు దొర్లిపోతున్నాయి. పరిశ్రమలో ఆర్థిక మాంద్యంలో మార్పు లేదు. రాజేష్ ఉద్యోగ పరిస్థితిలో కూడా మార్పేం లేదు. రాజేష్ దుర్గ బలవంతం మీద అతని తల్లిదండ్రుల దగ్గరికి కర్నూలుకు వారం రోజుల పాటు వెళ్ళి వచ్చాడు. అతనికీ కాస్త మార్పు అనిపించినా తిరిగి రాగానే మళ్ళీ మామూలే! అమ్మ ఇంకా కొన్ని రోజులుండమంటే, ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు వస్తే కష్టమని చెప్పి వారం రోజులే ఉన్నాడు. అతనికెక్కడయినా నెమ్మదిగా ఉండటం కష్టంగా ఉంది. ఒక వయసులో తన ఇల్లు, కుటుంబం అని తయారుచేసుకున్నాక, తల్లిదండ్రుల దగ్గరయినా బాల్యపు రోజులలాగ ఉండటం కష్టం!

***

దుర్గ టీంలో కొత్తగా చేరిన తాంత్రిక రచయిత అఖిల్ అనే అతను పగలు ఉద్యోగం చేస్తూ సాయంత్రం ఐసిఎఫ్ఐ ఇన్‌స్టిట్యూట్‌లో ఎం.బి.ఏ చేస్తున్నాడు. అతడికి చాలా తబ్బిబ్బయినప్పుడు తనలో తనే మాట్లాడుకోవడం అలవాటు. ఉదయం త్వరగా నిద్రలేవలేని అఖిల్ పది గంటలకు అందరూ కాఫీ బ్రేక్‌లో ఉన్నప్పుడు కానీ ఆఫీసులో అడుగు పెట్టడు. వారంలో రెండు రోజులు సాయంత్రాలు, వారాంతాలు మాత్రం అతను క్లాసులకు వెళ్ళాలి. మిగతా రోజులు అతను రాత్రి పది అయితే కానీ ఆఫీసు వదలడు. అందుకని హేమంత్ కూడా అతన్నేమీ అనడు. అఖిల్ అలవాటుగా తనలో ఏదో తిట్టుకుంటూ తన క్యూబికల్ దగ్గరికి వెళ్తుంటే, దుర్గ అడక్కుండా ఉండలేక పోయింది. "ఏమయింది అఖిల్! ఎందుకంతలా అప్‌సెట్ అయి ఉన్నావు?" అని. "లుక్ యార్ దుర్గా! మూడు వారాలయింది, మాకు బిసినెస్ ఎకనమిక్స్ పేపరు టీచ్ చేసే మాస్టరు ఉద్యోగం వదిలేసి, ఇంతవరకూ ఎవరూ రాలేదు. నెల రోజుల్లో పరీక్షలున్నాయి. ఆ పేపర్లో డుమ్మీ కొట్టకుండా ఉండాలంటే ఏం చెయ్యను?" అని అడిగాడు అమాయకంగా. ఆ అమాయకత్వంలో ఒక ధైర్యం కూడా ఉంది, దుర్గ నుంచీ తన సమస్యకొక సమాధానం వస్తుందేమోనని. మళ్ళీ ఏదో గుర్తొచ్చినవాడిలా "రాజేష్ మాస్టర్స్ ఎకనమిక్స్ే గదా? తను నాకు పాఠం చెప్పగలడా? సారీ దుర్గా తను ఊరికే కూచుని ఉన్నాడని అడగటం లేదు. ప్లీజ్! ఐయాం డెస్పరేట్!" అన్నాడు అఖిల్. "రాజేష్‌ను అడిగి చెప్తానా!" అని చెప్పింది దుర్గ.

ఈ సంఘటన దుర్గ మనసులో ఇంతవరకూ రాని ఆలోచనలేవో రేకెత్తించింది. సాయంత్రం వెళ్ళే ముందు అఖిల్ సీటు దగ్గరికెళ్ళి, "శనివారం నీ క్లాసులు ఎప్పుడు మొదలవుతాయి?" అని అడిగింది. "ఏం? తొమ్మిదింటికే మొదటి క్లాసు ప్రారంభిస్తారు".

"శనివారం మీ బ్రేక్‌లో వచ్చి కలుస్తాను. నన్ను మీ ప్రిన్సిపల్‌కు పరిచయం చేస్తావా?"

"ఎందుకు? ఆయనతో పోట్లాడతావా నాకోసం?"

"అదేం కాదులే ఎందుకంత భయం? నీకు ఒక పర్మనెంటు సొల్యూషన్ చూపిస్తాననుకో!" అనేసి వెళ్ళిపోయింది.

***

ఆ రోజు శనివారం. ఆ వేళయినా దుర్గ ఇంట్లో ఉంటే రాజేష్ కాస్త తన చిరాకును ఆమె మీద చూపించొచ్చు. మళ్ళీ ఆమెను బుజ్జగించి ఏ సినిమాకో, మాల్‌కో వెళ్ళి కాలం గడపటం చేస్తారు. "యు ఆర్ సఫరింగ్ ఫ్రమ్ ఎల్.ఏ.ఎస్. రాజేష్" అంటుంది దుర్గ ముద్దుగా. (సాఫ్ట్‌వేర్ ప్రపంచంలో అన్నిటికి పొట్టిపేర్లుపయోగిస్తారు. అదే సంప్రదాయంలో ఎల్.ఏ.ఎస్ అంటే ల్యాక్ ఆఫ్ అటెన్షన్ సిండ్రోం అని అర్థం! అంటే చిన్న పిల్లలు మనం వాళ్ళను పట్టించుకోకపోతే గీపెట్టి ఏడ్చేలాగన్నమాట!)

కానీ గురువారమే చెప్పి ఉంచింది దుర్గ, శనివారం కొంచం సేపు ఆఫీసుకు వెళ్ళాల్సి ఉంటుందని. త్వరగా బయలుదేరి మధ్యాహ్నానికి వచ్చేస్తుందేమో అంటే పదిన్నర వరకూ దుర్గ ఇల్లు వదల్లేదు. తన దుస్తులు కూడా మారాయి. సాధారణంగా సల్వార్– కమీజ్ లేదా జీన్స్–టీ షర్ట్‌లో ఆఫీసుకు వెళ్ళే దుర్గ ఆరోజెం

## 'అల్లరి'కి సోనమ్ ఓకే?



దర్శకుడు కె.విశ్వనాథ్ అల్లరి నరేష్‌తో కలిసి చేస్తున్న సినిమాకు అనిల్‌కపూర్ కూతురు సోనమ్ కపూర్ ఓకే చెప్పే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వినవస్తున్నాయి. ముందు నరేష్ పక్కన కమల్‌హాసన్ కూతురు శృతి హాసన్‌ని అనుకొన్నా, దానికి శృతి 'నో' చెప్పడంతో అనిల్‌కపూర్‌ను కలిసినట్లు తెలిసింది. అల్లరి నరేష్ పక్కన చేయడానికి సోనమ్ కపూర్ అంగీకారం తెలిపే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది.ఈ సంగతి ఇంకా అధికారికంగా ధృవీకరణ కాలేదు. ప్రస్తుతం బాలీవుడ్‌లో హాట్ హాట్ హీరోయిన్‌గా గుర్తింపుపొందిన సోనమ్ ఈ అవకాశాన్ని అంగీకరించకపోవచ్చని మరికొందరు అంటున్నారు. అయితే అనిల్‌కపూర్‌కి కె.విశ్వనాథ్ అంటే గౌరవం ఎక్కువనీ, ఈ కారణంగా తన కూతురికి నచ్చజెప్పవచ్చని మరి కొందరి వాదన.

కవిత

# నిర్మల్ బొమ్మల కొలువు

కొమ్మ కొమ్మకూ పిట్టలే – అన్నీ తాజా కూరగాయలే
గాండ్రించే పులి – పరిగెత్తే లేడి
ఎర్రముక్కు చిలక – చెట్టుమీద జాంపండు
పెళ్లి మేనాలు, పిల్లనగ్రోవి కృష్ణుడు..
పొన్న చెట్టుకింద గోపికలు
వర్షానికి ముందు తూనీగల దండల్లే పరుచుకున్నాయి
అలుపెరుగని ఆ ఎర్రగాజుల చేతులు
నగిషీలు నగిషీలుగా కదిలిపోతుంటాయి.
పుష్పమ్మ నుదిటిపై బ్రహ్మగీతలే గోపికల
కాటుక కళ్ళ రేఖలుగా మారినాయేమో!
పొయిలోకి చేరే పొవికి చెక్క నకాషీ తింబయ్య
చేతిలో పొన్నచెట్టై, యమునా తీరమైందేమో.
మరికొన్ని సంక్రాంతికో, దీపావళికో బొమ్మల
కొలువులో పేరంటాళ్లయినాయి.
మేళాలో నా ఈ చేతులు పేర్చిన బొమ్మలన్నీ
అపురూపంగా సాకిన చిట్టితల్లై కళ్ళను హత్తుకుంటాయి.
నా చేయి దాటుతున్న ప్రతి బొమ్మా అప్పగింతల
పెళ్లి కూతుళ్ళల్లే తోస్తాయి
గొంతుని కోజల్లా తాడుచుట్టి విసిరిన బొంగరం
చేసినప్పుడే కదా! పూట గడిచేది.
ఒక్కోసారి కొసిరి కొసిరి బేరమాడుతున్నప్పుడు
కరుగుతున్న మట్టి బొమ్మలా పాకిపోతుంది మనస్సు
రింగురింగుల చెక్కపొట్టుపై తడారిన చెమట
చుక్కలే కదా మా చిరునామాలు.
ఓ అపరిచితుడు మా బొమ్మల్లో ఈది
మునకేస్తున్నప్పుడే కదా బతుకుపై ఆశ అంటుతుంది.
ఓ కళాపిపాసి కళ్ళలో ఇంద్రధనుస్సు వలయాలు
పోటీ పడుతూ తళుక్కుమన్నప్పుడే కదా!
జీవం కుదుటపడుతుంది.
చిన్ని తల్లి మారాం చేస్తూ కలవరించినప్పుడే
కదా! ఈ కళ అత్యావశకమవుతుంది.
బొమ్మలన్నీ అమ్మలై నా వైపు చూసినపుడు
ఏడు సముద్రాలు దాటి గెలిచినట్టుంటుంది.
కడుపు నింపని సత్కారాలు అల్మారాలో అలంకారాలల్లే
తప్పెట్లేసే బొమ్మలయినాయి.
వేప చెట్టుపై రాయితీ పరాన్న మొక్కలై
బతుకీడుస్తున్నపుడే గుండెకు గండిపడుతుంది.
పెన్షన్ – గూటిపడవలో లాంతరు వెలుగవుతుంది.
అధికారి ఈసడింపు, చెలాయింపుల మధ్య
చిట్లిన కళ్ళద్దాల్లో నుండి వాన చుక్కలై
ఎదురు చూపు 'నిత్య' అవుతుంది.
నల్లరేగడి బీటలై వణుకుతున్న ఆ చేతులకు
పూట పూరక పాలిపోయిన ఆ కళ్ళకు
పస్తులతో పలచబడినామెకు
ఏ వేకువ వెలుతురు పందిరవుతుందో
ఏ చేతి కర్ర పూతవుతుందో కదా!

– సిహెచ్. ఉషారాణి

దుకో అపురూపంగా చీరె కట్టుకుంది. రాజేష్ అనుమానంగా చూడటం ఆమె దృష్టిని దాటలేదు. చిరునవ్వులు చిందిస్తూ చెప్పులేసుకుని బయటికి నడిచింది.

"ఆఫీసులో ఏదయినా ఎత్నిక్ డ్రస్‌కోడ్ పార్టీ అయితే తనకు చెప్పేది కదా?" అనుకుంటూ టీవీ ఆన్ చేసి హెచ్.బి.ఓ.లో 'ఓషన్ ఎలెవెన్' సినిమా వస్తుంటే చూస్తూ కూర్చుని ఆలోచనల్లో పడ్డాడు రాజేష్. ఎప్పుడూ పడుకునో ఆలోచనల్లో కొట్టుకుంటూనో ఉండకుండా తనలో క్రియాశీలతను పోగొట్టుకోకుండా ఏదో ఒకటి చేస్తూ ఉండాలి అనుకుంటాడు. కానీ ఏం చెయ్యాలో తోచదు. ఎంతసేపని చదవటం, టీవీ చూడటం, ఇంటర్‌నెట్ బ్రౌస్ చెయ్యటం? జాబ్ ఏజెంట్లు ఫోన్ చేసి ఏదయినా ఉద్యోగం గురించి చెప్పినా, అంత ఆసక్తికరమయిన అవకాశాలేం రావటం లేదు. దుర్గ మాత్రం తనతో చాలా ఓర్పుగా, తన పరిస్థితిని అడుగడుగడుగునా అర్థం చేసుకుంటూ నడుచుకుంటోంది. ఆమెకూ వృత్తిపరంగా ఉండే ఒత్తిళ్ళు తక్కువేం కాదు. అవి ఈ ఆర్థిక మాంద్యం పరిస్థితుల్లో ఇంకా ఎక్కువయ్యాయి. పన్నెండు గంటలు దాటే ముందు, ఇంటికి తిరిగొచ్చింది దుర్గ.




వచ్చి ఉసూరుమంటూ రాజేష్ పక్కన సోఫాలో కూర్చున్న దుర్గ పెదవుల మీది దరహాసం ఆమె అనుకున్నదేదో సాధించినప్పుడు మాత్రమే వచ్చే రకం! 'చెప్పు' అన్నట్లు ప్రశ్నార్థకంగా ఆమె వైపుచూశాడు రాజేష్. "రాజేష్! ఇంట్లో భోంచెయ్యాలంటే బోరుగా ఉంది. ఎటయినా బయట లంచ్ చేద్దామా?" అని అడిగింది.

ఈ హఠాత్తు పరిణామం ఎందుకో అర్థం కాలేదతనికి. "పొద్దున్నే వంట చేసి పెట్టావనుకుంటా?" అని అడిగాడు సందేహంగా. "ఫరవా లేదులే! రాత్రికి తింటే సరిపోతుంది" అని బయలుదేరదీసింది.

'ఇంచర' హోటెల్ ముందు బైక్ పార్క్‌చేసి లోపలికెళ్ళారు. అదొక గార్డన్ రెస్టారెంట్. టేబిల్ ఎన్నుకుని కూర్చుని కావలసిన భోజనం ఆర్డర్ చేసే వరకూ ఇద్దరూ ఏం మాట్లాడుకోలేదు. బేరర్ ఆర్డర్ తీసుకుని వెళ్ళిపోయిన తర్వాత, అన్నాడు రాజేష్, "ఊ! ఇప్పుడు చెప్పు విషయమేంటో?" అన్నాడు నవ్వుతూ.

"నీకు చెప్పకుండా ఈరోజొక పని చేశాను, కోపం రాదుగా?"

"వివరాలు తెలియందీ కోపమెలా తెచ్చుకోను?"

"మనిద్దరికీ పరిచయమయిన కొత్తలో నువ్వు వ్యాపార విశ్లేషణలో చేరకపోతే వేరే ఏం ఉద్యోగం చేసే వాడివి అని అడిగితే నువ్వేం చెప్పేవాడివి?"

"స్కూలు టీచర్ అయి పాఠాలు చెప్పే వాణ్ణి..." 'ఈమె ఏదయినా స్కూల్లో ఉద్యోగం చెయ్యమంటుందా ఏమిటి' అని తనవైపు అనుమానంగా చూశాడు.

"ప్రస్తుతం పరిశ్రమ ఉన్న పరిస్థితుల్లో మనకు కావలసిన ఉద్యోగం కోసమే వెతికే కన్నా, దొరుకుతున్న ఉద్యోగాల్లో మనకు నచ్చినవీ, సరిపోయేవీ ఏవో కనుక్కుంటే మంచిది కదా అనిపించింది. నువేమంటావ్?"

"నువ్ చెప్పేది నిజమే. నేనీ కోణంలో ఆలోచించలేదు"

"నా సహోద్యోగి అఖిల్ తెలుసుగా? వాడు ఐ.సి.ఎఫ్.ఏ.ఐ.లో ఎం.బి.ఏ చేస్తున్నాడు. కొన్ని రోజులుగా వాళ్ళకు 'బిజినెస్ ఎకనమిక్స్' చెప్పే లెక్చరర్ ఎవరూ లేరట. నాకు ఆలోచిస్తే నువ్ దీనికి సరిపోతావు కదా అనిపించింది. కానీ అవునో కాదో తెలుసుకోకుండా నీతో చెప్పడం ఇష్టం లేదు. పైగా జీతం ఎంతిస్తారో కూడా తెలీదు. అందుకనే నీకు చెప్పకుండా ప్రిన్సిపాల్‌ను కలవటానికి నేనొక్కదాన్నే వెళ్ళాను. నీ 'బయోడేటా' చూపించాను."

"........" రాజేష్ ఏమీ స్పందించలేదు. చెప్తున్నదాన్లో తనకు అయిష్టం ఏదీ లేకపోయినా కాస్త హఠాత్తు కావటం తనకు ముందే చెప్పక పోవటం అతనికి అంతగా రుచించలేదు. కానీ ఆమె తన కోసం పడే ఆదుర్దా, ఆత్రుత అతను అర్థం చేసుకోగలడు. అందుకని అనవసరంగా ఏదో ఒకటి అని ఆమె మనసు నొప్పించటం ఇష్టం లేదు.

"ఏమన్నారాయన?"

"ప్రిన్సిపాల్ చంద్రశేఖరం నిన్ను రేపే వచ్చి ఆయన్ని కలిస్తే పుస్తకాలు సిలబస్ తీసుకోవచ్చని చెప్పారు"

"......."

"జీతం ఇరవయి వేలు మాత్రమే ఇవ్వగలరట. ఆర్థిక మాంద్యం వల్ల విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిందని ఆయన తన గోడు విప్పుకున్నాడు. నాకు తెలుసు నువ్వు కోరుకునే ఉద్యోగం వస్తే దీనికి మూడంతలు సంపాదించగలవు నువ్వు. కాదనను కానీ..."

"పోన్లే దుర్గా మనకిప్పుడంత డబ్బుకేం కటకటగా లేదు కదా?"

"అయితే నువ్వీ ఉద్యోగంలో చేరతావా?" సంభ్రమంగా అడిగింది దుర్గ.

"ఓ! షూర్! వెళ్ళి పుస్తకాలు తెచ్చుకుని క్లాసులకు తయారు చేసుకుంటాను"

"నిజంగా?"

"ఎవరికి తెలుసు? ఎంబిఏ చెయ్యాలని కూడా నాకు ఆసక్తుంది. కొన్నాళ్ళయ్యాక అక్కడే ఫీజ్‌కు ఫాకల్టీ డిస్కౌంటు ఇస్తారేమో కనుక్కుని చేరతాను. విరామ సమయంలో డిగ్రీలు పెంచుకున్నా మేలే కదా?" అన్నాడు రాజేష్.

దుర్గ సంతోషం పట్టలేకపోయింది. రాజేష్‌ను వాటేసుకుందామని అనుకుంటే అది హోటల్ అయిపోయింది. అక్కడికి తీసుకొచ్చి విషయం చెప్పినందుకు తన్ను తాను తిట్టుకుంది.

దుర్గ కళ్ళలో మారుతున్న భావాలను గమనిస్తున్న రాజేష్, "ఎస్ మేడం! యు హావ్ మిస్డ్ ఎ కిస్ బై కమింగ్ హియర్!" అని చాలా రోజుల తర్వాత హాయిగా నవ్వాడు.

*